క్లుప్తంగా

సమాజ హితం కోసం భగవద్గీత ప్రచారాస్త్రం



ప్రచారం చేస్తున్న ప్రభోదసేవాసమితి ప్రతినిధులు

దేవరుప్పుల : నూతన సాంకేతిక పేరిట సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగుతున్న తరుణంలో సమాజ హితం కోసం త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలతో ప్రచారం చేపడుతున్నట్లు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందు జ్ఞానవేదిక భువనగిరి, చేర్యాల, జనగామ కమిటీ ప్రతినిధులు దేవేందర్, పంచాక్షరి, లింగస్వామి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కోలుకొండలో జూలై 10న తలపెట్టిన గురుపౌర్ణమి పురస్కరించుని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో పలు రకాల పుస్తకాలతో కూడిన బస్సుయాత్రతో విస్తృత ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో భాస్కర్, రామకృష్ణ, మధు, సాయిరాజు, శ్రీరామ్, తారక్, శంకరయ్య, లత, లావణ్య, మంజుల, రాజేశ్వరి పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు ఆకర్షితుడై సీపీఎంలో చేరిక



మహ్మద్ భాషాను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి సారయ్య

పాలకుర్తి : శిక్షణ తరగతులకు ఆకర్షితుడై గతంలో ఏ పార్టీలో పనిచేయని మహ్మద్ భాషా ఆదివారం సీపీఎం పార్టీలో చేరాడు. మండలంలోని ఈరవెన్ను గ్రామంలో రెండు రోజులుగా రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ఆకర్షితుడయ్యాడని పార్టీ మండల కార్యదర్శి మాచర్ల సారయ్య హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అవకాశాలను పోరాటాలను చేయడం ద్వారా సాధించే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి ఏదునూరి మదార్, కొనకటి బుచ్చయ్య, జక్కుల శోభన్‌బాబు, కొంతం మహేందర్, జవాజీ అబ్బాయి, సమ్మయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



దేవరుప్పుల : మండలంలోని సీతారాంపురం-కడవెండి మధ్య కొనసాగుతున్న రోడ్డు విస్తరణలో చేపట్టిన అసంపూర్తి పనులతో కల్వర్టు వద్ద ప్రమాదకరంగా మారింది. గత ప్రభుత్వం హయాంలో జనగామ–సూర్యాపేట రహదారిలోని సీతారాంపురం బస్‌స్టేజీ నుంచి కోలుకొండ క్రాసింగ్ (పాలకుర్తి)రోడ్డు వరకు రూ.13.50 కోట్లతో పనులు మంజూరయ్యాయి. ఈ పనుల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో కల్వర్టుల నిర్మాణం కొనసాగుతుంది. ఈ పనులు పూర్తవగానే వాహనదారులకు ఇబ్బందులు కాకుండా చదును చేయాల్సి ఉండగా సదరు యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆ ప్రాంతాల్లో మట్టిగుంతలు ఏర్పడి సర్కస్‌పీట్ల మాదిరిగా తయారైంది. దీంతో కల్వర్టు వద్ద రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్టు వాపోతున్నారు.

అమ్మ ఫౌండేషన్‌కు వాహనం అందజేత



ఫౌండేషన్‌కు వాహనాన్ని అందజేస్తున్న మధు

జనగామ రూరల్ : అమ్మ ఫౌండేషన్ సేవ కార్యక్రమాలకు వైట్ అండ్ వైట్ ప్రొప్రయిటర్ గజ్జి మధు వాహనాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా అమ్మ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజు మాట్లాడుతూ పట్టణంలో అమ్మ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను దశాబ్ద కాలంగా చూస్తూ నిరాశ్రయుల, అనాథల వద్దకు అన్నదాన కార్యక్రమాలు మిగిలిన ఆహారం తరలింపునకు, విద్యార్థులకు బుక్స్ స్టేషనరీ, మొక్కలను నాటేందుకు సేవా కార్యక్రమాలకు వినియోగించేలా ఒక వాహనాన్ని అందించడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మర్యాల అశోక్ నల్ల వినోద్, సల్ల మహేష్, మద్దెల కార్తీక్, బింగి నరసింహులు, లఖాన్ సింగ్, చందు, గౌరీ, సాయి దేవి నవీన్, ఎండీ.అప్రోజు, నితీష్, బన్నీ, ఎండీ.అంజర్, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా రహదారి పనులు

- గడువు ముగిసి ఆరేళ్లు
- పూర్తికాని సర్వీస్‌రోడ్లు, సైడ్ రెయిలింగ్‌లు
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు
- పట్టింపులేని పాలకులు, అధికారులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో శ్రీవాణి గురుకుల పాఠశాల సమీపాన అసంపూర్తిగా ఉన్న సర్వీసు రోడ్డు

స్టేషన్‌ఘన్‌పూర్ : నియోజకవర్గంలో జాతీయ రహదారి పనుల విషయంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో సర్వీస్‌రోడ్లు, సైడ్ రెయిలింగ్‌లు, డ్రెయినేజీ పనులు అరకొరగా అసంపూర్తిగా చేయగా ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. పనులు పూర్తిచేయాల్సిన గడువు ముగిసి ఆరేళ్లయినా పనుల పూర్తికి మోక్షం కలుగడం లేదు. కేవలం ప్రధాన రహదారి పనులపై దృష్టి సారించి రహదారి వెంట ఉన్న గ్రామాల్లో సర్వీసు రోడ్లు, సైడ్‌రెయిలింగ్ పనులు చేపట్టలేదు. అసలు పనులను పూర్తి చేసిన అధికారులు కొసరు పనుల్లో జాప్యం చేస్తున్నారు. జాతీయ రహదారి 163 విస్తరణ పనుల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2015లో రూ.1920 కోట్లతో యాదాద్రి–వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. విస్తరణ పనులకు రూ.897.03 కోట్లు, మిగిలిన రూ.1022.97 కోట్లు భూసేకరణ, ఇళ్ల యజమానులకు కేటాయించారు. 2016 జూన్ 1న నాటి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పనులకు శంకుస్థాపన చేయగా ఎల్‌అండ్‌టీ సంస్థ పనులను చేపట్టింది. యాదాద్రి జిల్లా వంగపల్లి నుంచి వరంగల్ జిల్లా ఆరెపల్లి వరకు 99.10 కిలో మీటర్ల రహదారి విస్తరణ పనులను 30 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంతో పనులను చేపట్టారు. వాస్తవానికి 2019 జనవరి వరకు పనులు పూర్తి కావాల్సి ఉంది.

సర్వీసు రోడ్లు లేక ప్రజల అవస్థలు

గ్రామాల్లో సర్వీసు రోడ్లు లేకపోవడంతో ప్రజలు అవస్థల పాలవుతున్నారు. సర్వీసు రోడ్డుపై నుంచి ప్రజలు నేరుగా జాతీయ రహదారి పైకి రా కుండా మధ్యలో రెయిలింగ్ వేయాలి. సర్వీసు రోడ్డుకు, జాతీయ రహదారికి మధ్య హైమాస్ట్ లైట్లు వేయాలి. సర్వీస్ రోడ్డు పక్కన డ్రెయినేజీలు పూర్తి చేసి మురుగునీరు ఇళ్లలోకి రాకుండా ఏర్పాటు చేయాలి. అయితే సంబంధిత అధికారులు కేవలం జాతీయ రహదారి విస్తరణ చేశారే గానీ సర్వీస్ రోడ్లు, రెయిలింగ్ పనులను విస్మరించారు. కొన్ని గ్రామాల్లో సర్వీస్ రోడ్లు కొంతమేర వేసి వదిలేశారు.

జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి



విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపాన సర్వీస్ రోడ్డుపైన ఏర్పాటు చేసిన షాపులు



పిచ్చిమొక్కల మధ్య సర్వీస్ రోడ్డుకు సంబంధించిన బోర్డు

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. జిల్లాలోని పెంబర్తి, లింగాలఘణపురం, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల్లో సర్వీసు రోడ్డు పనులను పూర్తి చేయలేదు. డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో సర్వీస్ రోడ్లు అసంపూర్తిగా వేశారు. స్థానిక బస్టాండ్ నుంచి శ్రీవాణి గురుకులం వరకు సర్వీసు రోడ్డు వేయాల్సి ఉండగా కేవలం విద్యుత్ సబ్‌స్టేషన్ వరకే వేసి వదిలేశారు. అదేవిధంగా మండలంలోని రాఘవాపూర్‌లో రహదారికి రెండువైపులా ఇంతవరకు సర్వీసు రోడ్లు వేయలేదు. చిల్పూరు మండలం చిన్నపెండ్యాలలో సర్వీస్ రోడ్లు, డ్రెయినేజీల పనులను అరకొరగా చేపట్టారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి సర్వీస్ రోడ్లు, రెయిలింగ్ పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డు లేక ఇబ్బందులు



ఘన్‌పూర్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ రహదారికి ఇరువైపులా అసంపూర్తిగా సర్వీస్ రోడ్డు పనులను చేపట్టారు. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు ప్ర మాదాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు. – ప్రసాద్, స్టేషన్‌ఘన్‌పూర్

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



ఘన్‌పూర్‌లో సర్వీసు రోడ్డు విషయంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు అరిగోస పడుతున్నారు. ఘన్‌పూర్‌తో పాటు గ్రామాల్లో సర్వీసు రోడ్లు, రెయిలింగ్, డ్రైనేజీ పనులను పూర్తి చేయాలి. – జయపాల్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్

ఈ పాఠశాలకు దారేది..?



ప్రాథమిక పాఠశాల దారికి అడ్డంగా చిరు దుకాణాలు

జనగామ పట్టణం రైల్వేస్టేషన్ ఏరియా ప్రాథమిక పాఠశాలకు దారి లేకుండా పోయింది. చిరు వ్యాపారులు దారికి అడ్డంగా షాపులను ఏర్పాటు చేయడంతో అక్కడ ఓ పాఠశాల ఉందనే విషయాన్ని మరిచిపోయేలా చేస్తున్నారు. పురపాలిక అధికారులు సైతం పట్టీపట్టనట్లు వ్యహరించడంతో రోజు రోజుకు ఆ స్థలం కుదించుకుపోతుంది – జనగామ

శివునిపల్లి మాజీ సర్పంచ్ దేవయ్య మృతి



దేవయ్య (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని శివునిపల్లి మాజీ సర్పంచ్ గుర్రం దేవయ్య (65) హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. శివునిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా 2006–2011 వరకు దేవయ్య సర్పంచ్‌గా పనిచేశారు. అతడి హయాంలో శివునిపల్లిలో ప లు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామస్తులు మన్ననలు పొందారు. కాగా ఇటీవల శివునిపల్లి ఎస్సీ కాలనీలో తమ సమీప బంధువు ఎల్లమ్మ మృతిచెందగా మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వారం క్రితం వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు క్రిందపడగా తలకు తీవ్ర గాయం కాగా హనుమకొండలోని రోహిణి ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య లింగమ్మ, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మాజీ సర్పంచ్ మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

మావోయిస్టులను చర్చలకు ఆహ్వానించాలి



మాట్లాడుతున్న విజయసారథి

తొర్రూరు రూరల్: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేసి, మావోయిస్టులను చర్చలకు ఆహ్వానించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ సారథి డిమాండ్ చేశాడు. ఆదివారం మండలంలోని వెలికట్ట గ్రామంలో సీపీఐ మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ సారథి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తూ వామపక్షాల భావజాలాన్ని లేకుండా చేసేందుకు ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు తమ్మెర విశేశ్వర్‌రావు, భిక్షపతి, బందు మహేందర్, పెరబోయిన కిరణ్, గంధం యాకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

ధర్మసాగర్ : మండలంలోని సోమదేవరపల్లిలో ఆదివారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా గబ్బెట శ్రీనివాస్, అధికార ప్రతినిధిగా గబ్బేట అరవింద్, గ్రామ అధ్యక్షుడిగా నమిండ్ల సుమన్, ఉపాధ్యక్షుడిగా కుక్క చార్లెస్, ప్రధాన కార్యదర్శిగా కుక్క శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా కుక్క అశోక్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, సలహాదారుడిగా గబ్బేట ప్రేమ్, కమిటీ సభ్యులుగా రవి, బాలరాజు, ప్రవీణ్, నవీన్, అరుణ్, రాజేష్, మహేష్, సుకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే ధ్యేయం

- బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని ఊకల్‌లో శ్రేణులతో ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. ప్రతి కుటుంబానికీ కనీసం ఒక్క పథకమైనా వర్తించిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పేదలు సంక్షేమ పథకాలు వర్తించక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. భవిష్యత్‌లో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అధిక స్థానాల్లో గెలిపించుకునే దిశగా శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని, అమలు చేసిన పథకాలను వివరించాలని సూచించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహ నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్, గ్రామ కమిటీ ఇన్‌చార్జ్ ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బద్దం వేణుగోపాల్‌రెడ్డి, లేతాకుల మధుకర్‌రెడ్డి, ఐత రాంచందర్, గజవెల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

వేలేరు : మహిళను లైంగికంగా వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజ్మీర సురేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన మురావత్ రమణ కొన్ని రోజుల నుంచి లైంగికంగా వేధిస్తుండటం, ఫోన్ చేసి బెదిరిస్తుండటంతో పలుమార్లు గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టిన కూడా అతడిలో మార్పు రాలేదు. వేధింపులు భరించలేక సదురు మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

లయన్స్‌క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

తొర్రూరు: లయన్స్‌క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో చేపట్టారు. అధ్యక్షురాలిగా తుమ్మూరి శ్రీదేవి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కూన పద్మావతి, కోశాధికారిగా మంజులతోపాటు కార్యవర్గ ప్రతినిధులచే ప్రమాణ స్వీకారం చేయించారు.

కార్లు ఢీకొని పలువురికి గాయాలు

బచ్చన్నపేట : ఎదురెదురుగా వస్తున్న కార్లు ప్రమాదవశాత్తు ఢీకొని పలువురికి గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని ఆలింపూర్ వద్ద చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రక్రారం.. చేర్యాల నుంచి బచ్చన్నపేట వైపు, జనగామ నుంచి చేర్యాల వైపు మరో కారు వెళ్తుండగా ఆలింపూర్ గ్రామం మలుపు వద్ద ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కార్లలోని ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో అందులో ఉన్న వారికి స్వల్పగాయాలయ్యాయి.

వరుస ప్రమాదాలు

మండలంలోని ఆలింపూర్ గ్రామంలోని మజీదు దాటిన తర్వాత మలుపు చాలా ప్రమాదకరంగా ఉంది. ఎన్‌హెచ్ రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్న క్రమంలో ఈ మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించక పోవడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు రోడ్డు వెడల్పు పనులను త్వరగా పూర్తి చేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం

- తరిగొప్పుల ఎస్సై గుగులోత్ శ్రీదేవి



చిల్పూరు : ఎస్సై ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న నాయకులు

తరిగొప్పుల : మాదక ద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని, వాటి నివారణకు సమష్టిగా కృషి చేయాలని ఎస్సై గుగులోత్ శ్రీదేవి అన్నారు. మాదకద్రవ్యాల నిరోధక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలకేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక కేజీబీవీలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా యువత ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రదీప్, కనకరాజు, సరోజన, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నివారణపై ర్యాలీ

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో ఆదివారం స్థానిక ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్ వాడడం వలన కలిగే నష్టాలపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డమీది సురేష్, ఇల్లందుల యాదగిరి, మామిడాల యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో భారత్

- బీజేపీ రాష్ట్ర నాయకుడు బేజాడి బీరప్ప



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు బీరప్ప

బచ్చన్నపేట : ప్రపంచదేశాల సరసన భారత్ అభివృద్ధి పథంలో పయనిస్తూ ప్రపంచ దేశాల దృష్టిని ప్రధాని మోదీ మార్చారని బీజేపీ రాష్ట్ర నాయకుడు బేజాడి బీరప్ప అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పలు వీధుల్లో తిరిగి 11 ఏళ్లలో మోదీ పాలనలో జరిగిన అభివృద్ధి గురించి కరపత్రాలను పత్రాలను పంచుతూ ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ దేశంలో గణనీయమైన మార్పులను తీసుకురావడానికి అనేక కీలక విధానాలు, పథకాలను అమలు చేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతున్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదన్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత నెలకొందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బంగారు మహేష్, ప్రధాన కార్యదర్శి మిన్నాలపురం జలేందర్, ఉపాధ్యక్షుడు రాపెల్లి చక్రపాణి, ప్రవీణ్, నాయకులు రమేష్, చంద్రమౌళి, నాగేష్, గణేష్, చెంద్రం, రాంబాబు, పరందాములు, రాజు పలువురు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం



చిల్పూరు : ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన బల్లెం వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం మృతుడి భార్య ఉమకు రూ.60 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. అందజేసిన వారిలో చిల్పూరు ఆలయ ధర్మకర్త గణగోని రమేష్, డిష్ వెంకన్న తదితరులు ఉన్నారు.

లింగాలఘణపురం : మండలంలో ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన బాధిత కుటుంబాలను మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ఆదివారం పరామర్శించి వారికి ఆర్థికసాయం అందజేశారు. కానుగంటి ఆంజనేయులు తండ్రి లక్ష్మయ్య, ఎర్ర సుధాకర్, శాగ మైసయ్య చనిపోగా ఆ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా దిరిపల్లి పాండురంగం తండ్రి ఇస్తారి చనిపోగా రూ.3వేలు, ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద ఉన్న మారోజు నారాయణకు రూ.2వేలు అందజేశారు. అదేవిధంగా వనపర్తిలో అనుముల ఉపేందర్‌రెడ్డి తండ్రి ఆగిరెడ్డి మృతి చెందగా కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు శివకుమార్, నాయకులు ప్రవీణ్, మోహన్, ఉపేందర్‌రెడ్డి, శ్రీధర్, యాదవరెడ్డి, మహేశ్, ఆంజనేయులు, సుదర్శన్‌రెడ్డి, సంపత్, రాజు, సుకేశ్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం..

- 11కేవీ తీగలు తెగి ఒకరికి తీవ్రగాయాలు
- ఆస్పత్రిలో రూ. 4లక్షలు ఖర్చు
- నష్టపరిహారం ఇవ్వాలని రైతు కుటుంబం డిమాండ్



తెగిన 11కేవీ విద్యుత్ వైరు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అరుణ్

పాలకుర్తి టౌన్ : విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపంతో 11 కేవీ వైర్లు తెగి విద్యుత్ ప్రమాదం ఒక రైతు కుటుంబాన్ని తీవ్ర వేదనకు గురిచేసింది. మండలంలోని తొర్రూరు గ్రామానికి చెందిన రైతు చిలువేరు జంపయ్య కుమారుడు అరుణ్ ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. 15 రోజుల క్రితం తన వ్యవసాయ పొలంవద్ద గొర్రెలను మేపుతుండగా పొలంలో 11 కేవీ విద్యుత్ వైరు తెగి ఇనుప విద్యుత్ స్తంభం సపోర్టు తీగలపై పడటంతో విద్యుత్ స్తంభం సమీపంలోకి వెళ్లగా అరుణ్‌కు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలుయ్యాయి. వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా ఇప్పటి వరకు రూ. 4 లక్షలపైగా ఖర్చు అయిందని రైతు జంపయ్య తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం జరిగిందని జంపయ్య ఆరోపించాడు. ఈ సంఘటన జరిగి 15 రోజులు అవుతున్నా విద్యుత్ శాఖ అధికారులు కూడా జరిగిన ఘటన తెలుసుకోలేదని తెలిపారు. ఇప్పటికీ విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని వాటిని తొలగించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని కోరారు. ఈ ప్రమాదంపై గ్రామస్తులు విద్యుత్‌శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదం

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని రైతు చిలువేరు జంపయ్య తెలిపాడు. 11కేవీ విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని గతంలోనే అధికారులకు చెప్పినా స్పందించలేదు. ప్రమాదం జరిగి 15 రోజులు కావస్తున్నా ఇప్పటికీ అధికారులు కూడా పరామర్శించలేదు. నేడు (ఆదివారం) నా కుమారుడు అరుణ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడని తెలిపాడు. మా కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుంది. విద్యుత్ శాఖ బాధ్యత వహించి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని రైతు డిమాండ్ చేశాడు.

విద్యుత్ వైర్లను తొలగిస్తాం

విద్యుత్ ప్రమాదం విషయం మాకు ఆలస్యంగా తెలిసింది. ప్రమాదంగా ఉన్న విద్యుత్ వైర్లు తొలగిస్తామని ఏఈ సత్తయ్య తెలిపారు. విద్యుత్ కాంట్రాక్టర్‌కు సమాచారం కూడా అందించామన్నారు.